క్లుప్తంగా

డి.ఎన్.పాలెంలో నేడు 'గడప గడపకు'

దేవీపట్నం: మండలంలో సోమవారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పర్యటించనున్నారు. డి.ఎన్.పాలెం పంచాయతీలోని పెద్దూరు, డి.ఎన్.పాలెం గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లకు శంకుస్థాపన చేస్తారని, అనంతరం డి.ఎన్.పాలెం సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీపీ కుంజం మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

మన్యంలో వింత వాతావరణం


అరకు-పాడేరు రహదారిలో కురుస్తున్న మంచు

డుంబ్రిగుడ: వారం రోజుల నుంచి మన్యంలో వింత వాతావరణం నెలకుంటుంది. ఆదివారం ఉదయం పూట భారీగా మంచు మధ్యాహ్నం ఎండ తీవ్రత, సాయంత్రం వర్షం కురుస్తుంది. దీంతో మన్యంలో వింత వాతావరణం నెలకుంటుంది. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన పర్యాటకులు మన్యం వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ ఆసరా సమావేశం

అడ్డతీగల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ మేరకు సమావేశంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరాయి.

29 నుంచి సీతారాముల కల్యాణోత్సవాలు

హుకుంపేట: మండలంలోని సూకురు గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఈ నెల 29, 30, 31 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ ధనసాని సత్యవతి, ఉత్సవ కమిటీ సభ్యులు గంజాయి అప్పలరాజు, ప్రవీణ్ ఆదివారం తెలిపారు. ఈ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కిముడుపల్లి ఎంపీటీసీ భర్తకు ఎమ్మెల్యే పరామర్శ

సాక్షి, పాడేరు: అపెండిసైటిస్ వల్ల తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతూ కేజీహెచ్‌లో శస్త్రచికిత్స చేయించుకుని వైద్యసేవలు పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత, కిముడుపల్లి ఎంపీటీసీ భర్త పాంగి రామారావును అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పరామర్శించారు. అతనికి కొంత ఆర్థికసాయం అందజేశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని కేజీహెచ్ వైద్యులను కోరారు.

31న మన్యం బంద్

సాక్షి, పాడేరు: స్థానిక గిరిజన ఉద్యోగుల భవనంలోని ఆదివాసీ జేఏసీ నేత రామరావుదొర ఆదివారం పలు గిరిజన సంఘాలు, పలు రాజకీయ పక్షలతో ఆదివాసీ జేఏసీ నేతలు సమావేశం నిర్వహించారు. రామరావుదొర మాట్లాడుతూ బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈనెల 31న చేపట్టనున్న మన్యం బంద్‌ను జయవంతం చేయాలని, పిలుపునిచ్చారు. అరకులోయలోని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స విలేకరులతో మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానం రద్దు చేయాలన్నారు.


ఎస్టీలకు అన్యాయం చేయొద్దు

కూనవరం: బోయ, వాల్మికి, బెంతురియలను ఎస్టీ జాబితాలో చేర్చడం సరికాదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ చింతూరు డివిజన్ అధ్యక్షుడు కుంజా అనిల్ అన్నారు. ఆయన మాట్లడుతూ ఎస్టీలకు ఉన్న అనేక రిజర్వేషన్లను తొలగించే ప్రయత్నం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీలకు అన్యాయం చేయవద్దన్నారు. సీహెచ్ చందర్‌రావు, కన్నారావు, చంటి, ఆనందు, వెంకట్, ముత్తయ్య పాల్గొన్నారు.

ప్రయాణం మరింత సురక్షితం

- ఘాట్‌రోడ్డు మలుపుల వద్ద ఐరన్ రెయిలింగ్
- రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డులు
- ప్రమాదాల నివారణపై వాహనచోదకులకు పోలీసుల అవగాహన


మలుపుల వద్ద రేడియం సూచిక బోర్డులు


మలుపుల వద్ద ఐరన్ రెయిలింగ్

అనంతగిరి: మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డులోని రక్షణ చర్యలు చేపట్టారు.. ఘాట్‌రోడ్డులోని కనీసం మరమ్మతకు నోచుకోకపోవడంతో రక్షణ గోడలు, రహదారి పూర్తిగా అధ్వానంగా మారాయి. పలువురు ప్రయాణికులు ప్రమాదాలకు గురైయ్యారు. ఈ ప్రమాదాల్లో కొంతమంది మృత్యువాతపడగా, కొందరు గాయాలపాలైయ్యారు. మన్యంలోని పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు పర్యాటకులు రోడ్డు ప్రయాణానికి ఆసక్తి చూపుతారు. వచ్చే క్రమంలోని రహదారి అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతుంటారు. 2021లో డముకు గ్రామ సమీపంలోగల హెయిర్ పిన్ బెండ్-5 మలుపుల హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు బస్సు బ్రేకులు ఫెయిలు ఫెయిలై లోయలో పడిన ఘటనలో నలుగురు మృత్యువాతపడ్డారు. ఘాట్‌రోడ్డులోని 8 హెయిర్‌పిన్‌బెండ్‌లు ఉన్నాయి. దీంతో పాటుగా మరికొన్ని మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఆయా ప్రదేశాల్లో పలు ప్రమాదాలకు తరచూ చోటు చేసుకుంటున్నాయి.

రక్షణ చర్యలు

2021లో లోయలో బస్సు పడిన తరువాత రక్షణగోడలకు సున్నం వేశారు. మలుపుల వద్ద రేడియం స్టాండ్‌లను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల రక్షణ గోడలు శిథిలావస్థకు చేరడంతో పాటు మరికొన్ని చోట్ల పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ఘాట్‌రోడ్డులోని ప్రయాణాలకు పర్యాటకులు, స్థానికులు ప్రయాణం భయాందోళన సాగించేవారు. 2022 అక్టోబర్ నుంచి ఘాట్‌రోడ్డులోని ఇరువైపులా రోడ్డులో మట్టిని చదునుచేశారు. రహదారి కాస్త విశాలంగా మారడంతో వాహనచోదకులు ప్రయాణాలు సుగమం అయింది. హెయిర్‌పిన్‌బెండ్ మలుపుల వద్ద రేడియంతో కూడిన సూచికబోర్డులను ఏర్పాటు చేశారు. అదే విధంగా శిథిలావస్థకు చేరుకున్న మలుపుల వద్ద ఐరెన్ రెయిలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డులో సుందరంగా తీర్చిదిద్దేందుకు హెస్‌హెచ్516 శాఖ అధికారులు కృషి చేయడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాఫీగా ప్రయాణం

ఘాట్‌రోడ్డులోని అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం ఆనందంగా ఉంది. ప్రయాణాలకు మార్గం సుగమం అయింది. గతంలోని ప్రయాణించాలంటే భయంగా ఉండేది. ప్రస్తుతం రక్షణ చర్యల చేపట్టడంతో ప్రయాణాలకు సాఫీగా సాగుతున్నాయి.

– రవికుమార్, వాహనచోదకుడు

పర్యాటకులకు అవగాహన



ప్రమాదాల నివారణలో భాగంగా ఘాట్‌రోడ్డు ప్రయాణంపై పర్యాటకులకు, వాహనచోదకులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

– కరక రాము, అనంతగిరి ఎస్ఐ

అ'పూర్వ' కలయిక

నర్సీపట్నం : మండలంలోని వేములపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986–87 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 36 ఏళ్ల తర్వాత ఒక్కటైన విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. విద్యార్థి దశలోని మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత తమ బాల్య మిత్రుల్ని కలుసుకోవడంతో ఆనంద భరితులయ్యారు. ఒకరినొకరు గుర్తుపట్టుకుని మరీ పలకరించుకున్నారు. అప్పటి చిలిపి చేష్టల్ని గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల రాకతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు వెంకట జోగయ్య, అమీర్ సాహెబ్, కాశీ శ్రీనివాసరావు, వైవీ రమణ, ప్రస్తుత హెచ్ఎం మోహన్‌రావును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.


తమకు విద్యాబోధన చేసిన గురువులతో పూర్వ విద్యార్థులు

జాతర ఘనంగా నిర్వహించాలి


పత్రం అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో వచ్చే నెల 17 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో ఆలయ కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నాలుగు రోజులు పాటు నిర్వహించే జాతరను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా కమిటీ నియామకపత్రాలను అందజేశారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు, జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీపీ అనూషా, మండల పార్టీ అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ సన్నిధిలో గురవయ్య యాదవ్

మాడుగుల : స్థానిక మోదకొండమ్మను తెలుగు యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన గురవయ్య యాదవ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకుల ద్వారా అమ్మవారికి రూ.10,116 నగదును అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల అప్పలరాజు శాలువా కప్పి, జ్ఞాపిక అందించి గురవయ్యను గౌరవించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్: తాకాశివీధి స్వయంభూ నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య వేడుకల్లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వీరంతా చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ రాజేష్, కమిటీ సభ్యులు సూర్యారావు, కొండలరావు, ఈశ్వరరావు, కృష్ణ, నాగేష్, విస్సు, సత్యం దొర, మహేష్‌దొర, పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు రూరల్ : పాడేరు పట్టణంలోని సుండ్రుపుట్టులో ఈ నెల 30 నుంచి శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దన్నేటి పలాసి సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఆవరణలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని సురేష్ పిలుపునిచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పనస కాపు అధరహో


కోటగరువు గ్రామంలో చెట్టు మొదలు కాపు వచ్చిన పనసకాయ

హుకుంపేట: ఏజెన్సీలో అందమైన ప్రకృతి అందాలతో పాటు కొన్ని సందర్భాల్లో ఆశ్చర్యపరిచే దృశ్యాలు కనువిందు చేస్తుంటాయి. గిరిజన ప్రాంతంలో ఎక్కువగా లభించే పనస చెట్లకు చెట్టుపైనే కాపు రావడం సహజమే కాని కొన్ని చోట్ల పనస చెట్టు మొదలే పనసకాయలు కాపు రావడం అరుదుగా కనిపిస్తు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మండలంలోని రాప పంచాయతీ కోటగరువు గ్రామంలో చెట్టు మొదలే పనసకాయ కాపు కాసిన ఈ అరుదైన దృశ్యం కనువిందు చేస్తుంది.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్లు

రంపచోడవరం: గిరిజన మిత్ర ఫౌండేషన్, కో–ఆపరేటివ్ బ్లడ్ డోనర్స్ వలంటరీ అసోసియేషన్, శ్రీరామ్ ఐ కేర్ రెటీనా సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత క్యాంప్ నిర్వహించారు. పలువురు డాక్టర్లు మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణదానం పొందవచ్చన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్త బాలబాలికలకు రక్తం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. గిరిజన మిత్ర మెనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఉదయ శ్రీనివాస్, రెడ్ క్రాస్ సొసైటీ కాకినాడ డాక్టర్ పరాశర సంజీవ్ రాణి రాజు అలీషా , కో–ఆపరేటివ్ బ్లడ్ డోనర్స్ వలంటరీ అసోసియేషన్ సభ్యులు సుధాకర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గాంధార పూల అందాలు అదుర్స్


గాంధార పూల తోట

మండలంలోని కేజీబీవీ పాఠశాలకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో గాంధార పూల అందాలు కనువిందు చేస్తున్నాయి. ఏటా మార్చి నుంచి ఏప్రిల్ మాసంలో ఈ పువ్వులు ఈ ప్రాంతంలో దర్శనమిస్తాయని స్థానికులు చెబుతున్నారు. గుంటసీమ ప్రధాన రహదారికి ఇరువైపులా దర్శనమిస్తున్న ఈ పూల అందాలు ఆకట్టుకుంటున్నాయి. స్థానికులతో పాటు పర్యాటకులు గాంధార పూల అందాలకు ఫిదా అవుతున్నారు.

– డుంబ్రిగుడ

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ

మారేడుమిల్లి: వేటుకురు గ్రామానికి చెందిన జిల్లా వాల్మికి సంఘ సభ్యుడు గొర్లె చిననారాయణరావు తల్లి గొర్లె చిన్నమ్మ (80) మృతి చెందినట్టు తెలిపారు. సమాచారం తెలుసుకున్న సమాచారం అందుకున్నారు. భౌతిక కాయనికి జిల్లా , మండల, గ్రామ వాల్మికి సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. మృతుడి కుటుబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కొండ రవి కుమార్, సర్పంచ్ కొండ జాకబ్, నాయకులు తదితరులున్నారు.

కాంగ్రెస్ నేతల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నేత సత్తిబాబు తదితరులు

అడ్డతీగల: రాహుల్ గాం, దీపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో అడ్డతీగలలో గాంధీ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు.

200 మందికి వైద్య పరీక్షలు


రోగులు, సహాయకులకు అన్నవితరణ

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించినట్టు మిషన్ కార్యదర్శి స్వామి వినిష్పలానాందజీ మహారాజ్ తెలిపారు. శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు, వీరిలో అవసరమైన వారికి, రక్తపరీక్షలు 74మందికి, థైరాయిడ్ పరీక్షలు ఎనిమిది మందికి, ఫీజియో థెరపీ పది మందికి ,ఎక్స్–రే లు పదమూడు మందికి, ఐదుగురికి ఈసీజీ చేసినట్టు స్వామీజీ తెలిపారు. డాక్టర్లు వెంకట సుబ్బారావు, జి.భాస్కర్, రాయుడు శ్రీనివాస్, సంపత్ కుమార్, రామకృష్ణ మిషన్ క్యాంప్ కో –ఆర్డినేటర్ శ్రీనివాస్ , సిబ్బంది పాల్గొన్నారు. రోగులు, వారి సహాయకులకు అన్న వితరణ చేసినట్టు స్వామీజీ తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా సంఘ సభ్యులతో, మాజీ ఎంపీటీసీ హేమామణి, సర్పంచ్ బాలురెడ్డి

వై.రామవరం: మండల కేంద్రంలోని డ్వాక్రా సంఘ సభ్యులకు వైఎస్సార్ ఆసరా మూడవ విడత సొమ్ము జమకావడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హేమావతి, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి తదితరులు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని, 164 డ్వాక్రా సంఘాలకు చెందిన 1545 మంది సభ్యులకు రూ.55,23,367 జమ అయినట్టు వెలుగు ఏపీఎం మధుబాబు తెలిపారు. డ్వాక్రా సంఘ సభ్యులు, గ్రామ సమాఖ్య లీడర్లు, వీవోలు, వెలుగు సీసీలు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం


బాధితులకు సాయమందిస్తున్న నాయకులు

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి పంచాయతీ, కొమరాపురంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన గ్రామ వలంటీర్ లోసుల రాజశేఖర్ కుటుంబాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రాజశేఖర్ పూరిల్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు కలిసి వెళ్లి ఆ కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరకులు, కూరగాయలు, ఆర్థిక సహాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సొసైటీ చైర్మన్ శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, బీంరెడ్డి సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరి, ఉప సర్పంచ్ రాళ్ళగడ్డ అర్జున్, నాయకులు జుర్రా జాన్ బాబు, అడపా కామేష్, అప్పాని సత్తిబాబు, దొంగర శ్రీను, రమేష్, వెంకటరమణ, సుజాత, శివ కుమార్, భాస్కరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


వంతెనపై భారీ గొయ్యి

చింతూరు: స్థానిక శబరినది వంతెనపై ప్రమాదం పొంచి ఉంది. వంతెన మధ్య భాగంలోని ఓ పిల్లరు వద్ద రహదారిపై భారీ గొయ్యి ఏర్పడింది. జాయింట్ విడిపోవడంతో సుమారు నాలుగు అడుగుల పొడుగు, రెండు అడుగుల వెడల్పు రంధ్రం పడింది. దీంతో వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రంధ్రం భారీగా ఉండడంతో చిన్నపిల్లలు ప్రమాదం బారిన పడే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రిపూట వంతెనపై చీకటిలో ప్రమాదాలు జరిగే ఆస్కారముందంటున్నారు. పిల్లర్ల వద్ద జాయింట్లు ఊడుతున్న ప్రదేశాల్లో అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నా తిరిగి గోతులు పడుతున్నాయి. ప్రమాదాలు జరగకముందే శాశ్వత ప్రాతిపదికన రంధ్రాలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు


పాత సీతారామ మందిరం వద్ద రామనామ గానం చేస్తున్న మహిళా బృందం

రోలుగుంట : స్థానిక పాత రామందిరం వద్ద ఉగాది నుంచి ప్రారంభమైన శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ అలయ కమిటీతో కలసి ఆదివారం పూజా కార్యక్రమాలు, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామివారి దర్శనాలు, ప్రత్యేక పూజలు, రాత్రుళ్లు మహిళా బృందాల చిడతలు, కోలాటాలతో గ్రామంలో ఆధ్యాత్మికత అలముకుంది. ఈ సంర్భంగా ఉత్సవ నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ భద్రాది రామాలయం మాదిరే ఈ గ్రామంలోని రామాలయం ఏక శిలపై నిర్మించినట్టు తెలిపారు. ఈ ఉత్సవాలు 30న సీతారాముల కల్యాణంతో ముగుస్తాయన్నారు. ఆ రోజు భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

వేడుకగా సీతారాముల పెళ్లిరాట


శ్రీరాముని పెళ్లి రాటను ముస్తాబు చేస్తున్న మహిళలు

ఎస్.రాయవరం : శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా తిమ్మాపురం సీతారామాలయంలో ఆదివారం పెళ్లిరాట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో చలువ పందిరివద్ద పెళ్లి రాట వేశారు. గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీరామ నవమి రోజున సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

అధ్వాన శ్మశానవాటికతో అవస్థలు


ఇందుకూరుపేటలో పొదలతో నిండిన శ్మశానవాటిక

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేటలో శ్మశానవాటిక అధ్వానంగా దర్శనమిస్తోంది. ఇందుకూరుపేట నుంచి గోపాలపురం వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా రెండు భాగాలుగా ఉన్న శ్మశాన వాటికలో సగ భాగం ఇటీవల గ్రామస్తులు గ్రావెల్‌తో నింపి సరిచేశారు. మిగిలిన సగభాగంలోని శ్మశానవాటిక ముళ్లపొదలతో నిండి అడవిని తలపిస్తుంది. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు నానా అవస్థలు పడాల్సివస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షాకాలం అయితే పరిస్థితి మరింత దారుణంగా మారి గొయ్యి తీసేందుకు కూడా అవకాశం లేక నీటితో నిండి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.